7న పాలకొండలో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పన సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న పాలకొండలో మినీ జాబ్ మేళా జరగనుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదువుకుని 18 నుంచి 32 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు వారి బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు (ఒరిజినల్ మరియు జెరాక్స్), ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9గంటలకు పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు హాజరుకావాలని చెప్పారు. ఇతర వివరాలకు 63012 75511 నందు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పరిష్కారం చూపని రెవెన్యూ సదస్సులేలా?

- భూ సమస్యలపై కోకొల్లలుగా దరఖాస్తులు
- ఆదాయ వనరుగా మలచుకునే యత్నంలో అధికారులు

రెవెన్యూ సదస్సులో భూసమస్య పరిష్కరం కోరుతూ వినతిని అందజేస్తున్న రైతులు (ఫైల్)

ప్రజాశక్తి - పార్వతీపురం

భూమి విలువ పెరుగుతున్న కొద్దీ సమస్యలు పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సమస్యలు పెరుగుతున్న కొద్దీ రెవెన్యూ అధికారుల ప్రాధాన్యత పెరుగుతోంది. దీంతో భూ సమస్యలున్న రైతులు పరిష్కారం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న వైనం ఎప్పటినుంచో ఉంది. ఫలితంగా భూమికి, సమస్యకి మధ్య విడదీయరాని బంధం ఏర్పడింది. ప్రభుత్వాలెన్ని మారినా భూమి చుట్టూ తిరిగే సమస్యలు పెరుగుతున్నాయి గానీ తగ్గడం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు, గ్రామ సదస్సులు గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్వహిస్తూనే ఉన్నాయి. అయితే సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలి ఉన్నాయి. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ నెలలు, ఏళ్ల తరబడి తిరుగుతున్నా అధికారులు పరిష్కరించనప్పుడు సదస్సుల్లో దరఖాస్తు అందజేస్తే ఏమేరకు పరిష్కారం లభిస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2014 నుంచి 2019వరకు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం హయాంలోనూ రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. అప్పటి నుంచి పరిష్కారానికి నోచుకోని భూ వివాదాలెన్నో ఇప్పటికీ సజీవంగా వున్నాయి. జిల్లాలో భూ సమస్యలున్న రైతులు వేల సంఖ్యలో ఉన్నారు. ఇటీవల మళ్లీ టిడిపి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల ప్రారంభానికి ముందు గ్రామసభలు నిర్వహించింది. ఈ గ్రామసభల్లో కూడా ఎక్కువగా భూమికి సంబంధించిన సమస్యలే అందాయి. ఆ తర్వాత మొదలైన రెవిన్యూ సదస్సుల్లో వేలాది సమస్యలు దరఖాస్తు రూపంలో చేరాయి. గత ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి మన్యం జిల్లాలో నిర్వహించిన 713 రెవెన్యూ సదస్సుల్లో 4,660 దరఖాస్తులు అందినట్లు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ చెప్పారు. ఈనెల 8 వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. అంటే మరో రెండు వేలకు పైగా దరఖాస్తులు చేరే అవకాశం ఉంది. ఇబ్బడిముబ్బడిగా భూ సమస్యలపై దరఖాస్తులు అందడానికి ప్రధాన కారణం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, మితిమీరిన అవినీతి. సమస్య పరిష్కరించాలని కోరుతూ రైతు మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసినప్పుడే పరిష్కరించి ఉంటే ఇన్ని వేల సంఖ్యలో సమస్యలు పుట్టుకొచ్చేవి కాదు.

భూ సమస్యను విన్నవిస్తే.. కోర్టుకు వెళ్లాలన్న విఆర్ఒ

బలిజిపేట రూరల్ :

బాధితుడు లక్ష్ము

ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తన భూ సమస్యను పరిష్కరించాలని కోరిన రైతుకు ఆ గ్రామ రెవెన్యూ అధికారి కోర్టు వెళ్లి తేలుకోమని ఉచిత సలహా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలం లోని వంతరాంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఇదే గ్రామానికి చెందిన రైతు నాగల లక్ష్మును సమస్య పరిష్కారం కోసం సదస్సుకు వెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వేలో భాగంగా సర్వేనెంబర్ 71/6, 016 సెంట్లు తన తల్లి నాగళ్ళ సూరమ్మ పేరున ఉన్న జిరాయితీ భూమిని వేరే వ్యక్తి పేరు మీద ఆ గ్రామ విఆర్ఒ ఆబోతులు గోపాలకష్ణ మార్చేశారు. అయితే లక్ష్ముకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, వారికి తెలియకుండా వేరే వారి పేరున విఆర్ఒ భూమి మార్చడం జరిగింది. ఈ విషయమై నాగల లక్ష్ము పలుమార్లు విఆర్ఒను జిరాయితీ భూమిని తన పేరున మార్చమని ఎన్నిసార్లు చెప్పినా విఆర్ఒ పట్టించుకోలేదు. ఆఖరుకు శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయగా, కోర్టుకెళ్లి తేల్చుకోవాలని దురుసుగా సమాధానమిచ్చారని, తనకు దిక్కున దగ్గర చెప్పుకోమని దుర్భసలాడారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తన సమస్యను పరిష్కరించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఆదాయ వనరుగా మలచుకునే యత్నంలో రెవిన్యూ అధికారులు

భూసమస్యలన్ని ఆదాయ వనరుగా మలచుకునే యత్నంలో మెజారిటీ రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు ఉన్నారనేది నిర్వివాదాంశం. సమస్య కాలపరిమితి ఎంత ఎక్కువగా ఉంటే ఆ సమస్యను జటిలమైన సమస్య గా పరిగణించి దాని పరిష్కారానికి రేటు నిర్ణయించే సంస్కృతి ప్రస్తుతం రెవెన్యూ శాఖలో వుంది. గత పదేళ్లుగా భూమి విలువ పెరుగుతున్న కొద్దీ సమస్యలు రెట్టింపయ్యాయి. సమస్యలు పెరగడానికి కారణం రెవెన్యూ అధికారుల అవగాహన లోపం కొంత అయితే, విచ్చలవిడి అవినీతి మరో ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. గ్రామస్థాయిలో ఉండే రెవెన్యూ అధికారులే ఎక్కువగా ఈ భూ సమస్యలకు మూలకర్తలుగా చెప్పుకోవచ్చు. విఆర్వోలిచ్చిన నివేదిక ఆధారంగానే మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకుంటారు. రైతుల మధ్య భూ సమస్యలు అపరిష్కృతంగా వున్నాయంటే కారణం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే. గ్రామ, మండల స్థాయిలో ఉన్న రెవెన్యూ అధికారుల్లో చాలామందికి భూసమస్యల పరిష్కారంపై అవగాహన కూడా లేదు. ఏ సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియక దాన్ని మరింత జటిలం చేసే అధికారులు కూడా వున్నారు. ఎవరు ఎక్కువ లంచం ఇస్తే వారికి అనుకూలంగా వ్యవహరించే అధికారులు కూడా ఉండడంతో చాలా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

దశాబ్ద కాలంగా కుడుమూరు భూవివాదం

జిల్లాలో పాచిపెంట మండలంలో కుడుమూరు భూవివాదం గత దశాబ్ద కాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. సర్వే నెంబర్ 48లో ఉన్న 782 ఎకరాల భూమిని సుమారు 200 మంది గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. జమిందారీ వ్యవస్థ లు, మొఖాసాలు అనేక దశాబ్దాల క్రితమే రద్దయ్యాయి. కుడుమూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 48లో ఉన్న భూములన్నీ ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో ఉన్నాయి. అయినా ఆ భూములు మొఖాసాదారులకు చెందినవని కొంతమంది నాయకులు, రెవెన్యూ అధికారులు వారికి వత్తాసు పలుకుతూ సమస్యని పరిష్కరించడానికి ఇష్టపడడం లేదు. కొంతమంది రెవెన్యూ అధికారులు, గల పాలకపక్ష నాయకుల అవినీతి వల్లనే ఈ వివాదం ఇప్పటికీ అపరిష్కృతంగా మిగిలింది. ఏళ్లతరబడి సాగులో ఉన్న గిరిజనులను పట్టాలివ్వకుండా రెవెన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఫలితంగా అమాయక గిరిజనులు ప్రభుత్వ పరంగా ఎలాంటి రాయితీలు పొందలేకపోతున్నారు. 2016 నుంచి సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు తమ సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ పోరాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ భూములపై సర్వే నిర్వహించారు. ఏ రైతు సాగులో ఎంత భూమి వుందనేది సర్వే చేశారు. కానీ దాన్ని ఇంతవరకూ బయటపెట్టలేదు. గతంలో ఐటిడిఎ పిఒ కూర్మనాథ్ కుడుమూరు భూములు ప్రభుత్వ భూములని ప్రకటించారు. రెండు, మూడేళ్లసాగులో ఉన్న గిరిజన రైతులకు పట్టాలిస్తున్నారు కానీ దశాబ్దాల తరబడి సాగులో ఉన్న కుడుమూరు భూములకు పట్టాలివ్వడం లేదు. దీనికి ప్రధాన కారణం కొంతమంది బడాబాబులు ఈ భూములపై కన్నేయడమే. వారికి అండగా నిలుస్తున్న రెవెన్యూ అధికారులు ఈ వివాదాన్ని పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోంది. కుడుమూరు జరిగిన రెవిన్యూ సదస్సులో గిరిజన రైతులు సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన రెవిన్యూ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ వివాదాన్ని అధికారులు ఎలా పరిష్కరిస్తారో వేచిచూడాల్సిందే.

తాత, ముత్తాల నుంచి సాగులో ఉన్నాం

కుడుమూరు రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూమిని తాత ముత్తాల నుంచి సాగు చేస్తున్నాం. పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.ప ట్టాలివ్వకపోవడంతో ప్రభుత్వ పరంగా ఎలాంటి రాయితీలు అందడం లేదు. భూమిపై రుణాలు మంజూరు కావడం లేదు..రైతు భరోసా రావడం లేదు. పంట నష్టపరిహారం కూడా అందని పరిస్థితి. అనేక సార్లు పట్టాలు ఇవ్వాలని దరఖాస్తు చేసినా ఫలితం లేదు. ఇప్పుడైనా సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాను.

సూకురు ఎర్రయ్య, గిరిజన రైతు,
తోకమెట్ట గ్రామం,పాచి పెంట మండలం

మహాసభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్
17 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఉందని, దాన్ని పక్కదారి మళ్లించి కార్పొరేట్ విద్యకు ఊడిగం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ విమర్శించారు. స్థానిక ఎపి ఎన్జీవో హోంలో రెండు రోజుల పాటు జరిగిన ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా 32వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ మహాసభలకు ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు కె.రామస్వామి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, మానవ హక్కుల సంఘం నాయకులు వి.దాలినాయుడు, అపస్మా రాష్ట్ర యూనియన్ నాయకులు, శ్రీజన్ స్కూల్ కరెస్పాండెంట్ శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, గిరిజన సంఘం నాయకులు పి.మోహన్‌రావు సంఘీభావం తెలుపుతూ జిల్లా మహాసభలు తీసుకునే నిర్ణయాలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాని నిర్మించాలని కోరారు.

అనంతరం అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని, అందుకోసం సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, పెండింగ్ ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు నెలకు రూ.3వేలు పెంచాలని, జీవో నెంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్నం భోజనం పథకం అక్షయ పాత్రకు ఇవ్వడం వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందదన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు, సంక్షేమ హాస్టల్లో వర్కర్లు, ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

తీర్మానాలు

మహాసభలో ప్రతినిధులు పలు తీర్మానాలు చేశారు. వాటిలో జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాలకొండ, పార్వతీపురం, కురుపాం కేంద్రాల్లో పీజీ సెంటర్లు నెలకొల్పాలని, సంక్షేమ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, కురుపాం ఇంజినీరింగ్ కాలేజీ పనులు త్వరితగా పూర్తి చేయాలని, పార్వతీపురంలో మెడికల్, ఐటిఐ కళాశాలు ఏర్పాటు చేయాలని పలు తీర్మానాలను ఆమోదించారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా అఖిల్, రాజు

మహాసభల అనంతరం 17 మందితో కొత్తగా జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా టి.అఖిల్, కార్యదర్శిగా కె.రాజు, ఉపాధ్యక్షులు కె.డేవిడ్, హెచ్.సింహాచలం, జిల్లా సహాయ కార్యదర్శులుగా సంధ్య, సూర్యతో పాటు మరో 11 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఇతర ఉద్యమ అవసరాల రీత్యా డి.పండు, పి.రాజశేఖర్‌ను ఎస్ఎఫ్ఐ నుంచి రిలీవ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పతాకంతో నాయకులను సత్కరించారు.

100 రోజుల్లో వంద రోడ్లు ప్రారంభం

నేడు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలోని మక్కువ, సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాల్లో 100 సీసీ రోడ్లను ఈ నెల 6, 7 తేదీల్లో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 6 నెల్లోనే సిసి, బిటి రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆమె చెప్పారు. సాలూరు నియోజకవర్గంలో ఆగస్టులో గ్రామసభలు, అక్టోబరులో పల్లె పండగలు ఘనంగా నిర్వహించామని, ఇందులో అందరి ఆమోదంతో ప్రతిపాదించుకున్న రోడ్లును 100 రోజుల్లోనే 100 సిసి రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. ఈ వంద రోడ్ల నిర్మాణానికి అవసరమయ్యే నిధులు మంజూరు చేసిన రాష్ట్రముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన గ్రామాల్లోని ప్రజలకు అన్ని వసతులు సమకూర్చడంతో పాటు రోడ్లు నిర్మించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపనలు చేసిన అనతి కాలంలోనే ప్రారంభోత్సవాలు చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నామని చెప్పారు. గిరి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా విద్య, వైద్యం, తాగు, సాగునీరు, రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. గుంతల రోడ్లను పూడ్చే ప్రక్రియ వేగవంతం చేయడమే కాకుండా రహదారి సౌకర్యం లేని గ్రామాల్లో రహదారులు నిర్మించుకోవడం జరిగిందని తెలిపారు. సోమవారం మక్కువ మండలం కాశీపట్నంలో (పలు గ్రామాల్లోని 35 సి సి రోడ్లు), సాలూరు మండలం తోణాంలో (పలు గ్రామాల్లోని 18 సిసి రోడ్లు), 7న పాచిపెంట, మంచాడవలసలో (పలు గ్రామాల్లోని 27 సిసి రోడ్లు), మెంటాడ, పెదమేడపల్లిలో (పలు గ్రామాల్లోని 22 సిసి రోడ్లు) ప్రారంభించనున్నట్టు మంత్రి స్పష్టం చేశారు.

యువతకు ఉద్యోగ కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - సాలూరు

మెగా జాబ్ మేళా ప్రారంభించిన మంత్రి

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

రాష్ట్రం లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా టిడిపి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ మెగా జాబ్ మేళాకు 25 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రోజు జరిగిన ఈ జాబ్‌మేళాకు 465 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 111 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల కోసం మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ .కె ఉషశ్రీ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇలాంటి జాబ్ మేళాలు సాలూరు నియోజకవర్గ యువత ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలని నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి ప్రజా ప్రతినిధులు, నైపుణ్యాభివృద్ధి సిబ్బంది, డిగ్రీ కళాశాల సిబ్బంది, సీడాప్ సిబ్బంది హాజరయ్యారు.

కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ నియోజకవర్గ పరిధిలో గల ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. విశాఖపట్నంలో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే పాలకొండ నియోజకవర్గంలో గల నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అదనపు తరగతి భవనాలను, కంప్యూటర్ ల్యాబ్ లు, లైబ్రరీలను మంజూరు చేయమని కోరారు. అలాగే పాలకొండ బాలికల జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా నిర్మింపబడి ఉన్న అదనపు తరగతి గదులను పూర్తి చేయాలని కోరారు. 2008లో వీరఘట్టంకు మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవన సదుపాయం లేదన్నారు. కాలేజీకి కేటాయించిన ఐదు ఎకరాల స్థలం ఉన్నందున శాశ్వత భవనం మంజూరు చేయమని కోరారు. ఇందుకు మంత్రి స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. వినతిని అందజేసిన వారిలో తూర్పు కాపు డైరెక్టర్లు గర్భాన సత్తిబాబు, గండిరామి నాయుడు, పాలకొండ పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయం

ఎమ్మెల్యే కళావెంకట్రావు

ప్రజాశక్తి - పాలకొండ

సంక్షేమ, అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుం దని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా పాలకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పెన్షన్ రూ.4వేలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు సమయం పట్టిందన్నారు. రూ.950 కోట్లతో రాష్ట్రంలో గుంతలమైన రోడ్లు మరమ్మతులు కోసం కేటాయించిందని తెలిపారు. ఇప్పటికే పనులు ప్రారంభించి చాలా వరకు పూర్తి చేసినట్టు స్పష్టం చేశారు. ఇటీవల టిసిఎస్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని, దాని ద్వారా సుమారు 2000 ఉద్యోగాలు యువతకు లభిస్తాయని తెలిపారు.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు ధాన్యాలు వారికి ఇష్టమైన దగ్గర అమ్ముకునే సౌలభ్యం కల్పించి 24 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో నగదు జమలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 8న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటిస్తున్నట్టు, కేంద్రం నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో ముందుకు వెళ్తుందని అన్నారు. 77 ఏళ్లుగా మండలంలోని అర్తలికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన తోటపల్లి ఆధునికరణకు పనులు త్వరలో తిరిగి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యల సుడిగుండంలో డిగ్రీ కాలేజీ

ఒకే గదిలో నాలుగు తరగతులు
అవస్థలు పడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - సీతంపేట

విద్య కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని... కేజీ నుంచి పీజీ వరకు మీ పిల్లలకు ఉచితంగా విద్యను అందించే బాధ్యత మాదని మన పాలకులు గొప్పలు చెబుతూనే ఉన్నారు. మాటలు కోటలు దాటమే తప్ప ఆచరణలో మాత్రం ఎక్కడా అలాంటి ఛాయలే లేవు. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ విద్యాసంస్థల తీరు మాత్రం అదే. ఇందుకు మచ్చుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీకాలేజీ దుస్థితే.

సీతంపేట ఐటిడిఎకు కూత వేటు దూరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. ఈ కాలేజీ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతుంది. చాలీచాలని ఇరుకు గదుల్లో అక్కడి అధ్యాపకులు పాఠాలు బోధిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా నానా అవస్థలు పడుతున్నారు.

ఒకే గదిలో వేర్వేరుగా నిర్వహిస్తున్న తరగతులు

ఇక్కడ కాలేజీ 2008లో ప్రారంభించినప్పటికీ నాలుగేళ్ల తర్వాత అంటే 2012లో భవనం నిర్మించారు. అప్పట్లో అధికారులు ముందు చూపు పెట్టుకోకుండా తక్కువ తరగతి గదులు నిర్మించడంతో విద్యార్థులకు ప్రస్తుతం ఇబ్బందులు తప్పడం లేదు. డిగ్రీ కళాశాల 570 సీట్లకు 300 మంది విద్యార్థిని విద్యార్థులు కంబైండ్‌గా విద్యను అభ్యసిస్తున్నారు. వీటిలో బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, బిఎస్‌సి బోటనీ, బిఎ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ కోర్సుల్లో చదువుతున్నారు. అంతవరకు బాగానే ఉంది. అయితే 20 గదులకు 9గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రస్తుతం ఒకే గదిలో ఫస్ట్, సెకెండ్ ఇయర్ బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ ల్యాబ్‌లు, బోటనీ ల్యాబ్ ఒకే గదిలో చదవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇద్దరు ఉపాధ్యాయులు రెండు, రెండు తరగతులు ఒకేసారి ఒకే గదిలో చెప్పడంతో విద్యార్థులకు అర్థ కాక తలలు పట్టుకుంటున్నారు. అంతేకాక ల్యాబ్ రూములు



తరగతి గదుల్లోనే నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపల్ ఛాంబర్ వర్షాకాలంలో కారుతోంది ఎప్పుడు పెచ్చులు ఊడిపోతాయోనని భయాందోళన చెందుతున్నారు. మరోపక్క విద్యార్థినీలకు విద్యార్థులకు ఒక్కటే మరుగుదొడ్డి ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. బాలురుకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మరో పక్క విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య కూడా వెంటాడుతుంది. విద్యార్థులకు క్రీడా మైదానం ఉన్నప్పటికీ చదును చేయకపోవడంతో ఆటలు ఆడుకోవడం కుదరడం లేదు. అంతేకాక ప్రహరీ గోడ లేకపోవడంతో ఏ విషపూరిత జంతువులు, విష సర్పాలు లోపలికి వస్తాయేమోనని భయం ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

అదనపు గదుల్లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఒకే గదిలో గ్రంథాలయం. తరగతి గదులు ల్యాబ్‌లో నివసిస్తున్నారు. మరుగుదొడ్డి కోసం బయటకు వెళ్తున్నా ం.

ఎస్ కరుణ, ఫైనల్ ఇయర్, బిఎ,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతంపేట .

పిఒకు కమిషనర్ ప్రతిపాదనలు పంపించాం

డిగ్రీ కళాశాలకు విద్యార్థులకు తగ్గట్టుగా అదనపు గదులు కావాలని, శ్లాబ్ కారుతుందని, ఈ విషయమై పిఒకు, కమిషనర్‌కు ప్రతిపాదన పంపించాం. అంతేకాకుండా విద్యార్థులు కూడా కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతులు సమర్పించారు.

సుశాంత్ జన ప్రిన్సిపాల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీతంపేట

వాహనచోదకులతో ప్రమాణం చేయిస్తున్న సిఐ అప్పలనాయుడు

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ

ప్రజాశక్తి - సాలూరు

వాహనదారులకు హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ కలుగుతుందని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం సాయంత్రం హెల్మెట్ ధారణపై వాహనదారులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్డులో వాహనదారులతో ఆయన ప్రమాణం చేయించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే హెల్మెట్ ధారణ అవసరమని చెప్పారు. చిన్న నిర్లక్ష్యమే ప్రాణాలను బలిగొంటుందని చెప్పారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడూ విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్, సభ్యులు

బాధితులకు అండగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

కంది కొత్త పండగలో జరిగిన అపస్మృతిలో మరణించిన రమేష్ కుటుంబానికి అండగా గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన ప్రస్తుతం హైదరాబాదులో స్థిరపడిన బుడంకాయల శ్రీనివాసరావు తరపున బొత్తాడ గౌరీ శంకరరావు ద్వారా రూ.10వేలు ఆర్థిక సహాయం చెముడుగూడ వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు తుంబలి వినోద్, మద్ది దొరబాబు, స్వాతి రెడీమేడ్ కొనిశ సూర్యం, గ్రామ సేవాదళ్ బిఎల్, డిజిటల్ అసిస్టెంట్ జి సందీప్, సదానంద్ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఇలాంటి సంఘటనల్లో గుమ్మలక్ష్మీపురంలో కుటుంబాలకు సహాయం అందించడం ద్వారా బుడంకాయల శ్రీనివాసరావు, హెల్పింగ్ హాండ్స్ తన సేవా దృక్పథాన్ని కొనసాగిస్తోంది.

క్రీడా మైదానంలో ఎక్కడికక్కడ తవ్విన గొయ్యిలు

తవ్వేశారు... వదిలేశారు...

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రీడామైదాన పనులకు సంబంధించిన గొయ్యిలను తవ్వేసి అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో క్రీడాకారులు ఆటలు ఆడుకొనేందుకు, వ్యాయం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కాలంలో పోలీస్ సెలక్షన్ అవుతున్నందున ఈ ఎంపికకు వెళ్లాలంటే ఇక్కడ వ్యాయాయం చేసేందుకు మైదానం అనుకూలంగా లేకపోవడంతో సెలక్షన్‌కు వెళ్లే వారంతా పూర్తిస్థాయిలో వ్యాయామం చేయలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడ మైదానాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

జలవిహారం చేస్తున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పార్కులోని అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ, యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు మినీ బోటింగ్, మినీ ట్రైన్ ఎక్కి సరదాగా గడిపారు. మరి కొంతమంది పర్యాటకులు సాహసోపేత క్రీడలు నిర్వహించారు. ఆనంద విహార వద్ద యువతీ, యువకులు కేరింతలు కొడుతూ ఉల్లాసం, ఉత్సాహంగా డాన్సులు వేశారు. 5డి థియేటర్ వద్ద సినిమాను వీక్షించారు. జెయింట్ వీల్ ఎక్కి ఆకాశంలో ఉయ్యాల ఊగారు. మెట్టుగూడ జలపాతంలో పర్యాటకులు జలకాలాడారు. ఆడాలి యు పాయింట్ సందర్శించి, ప్రకృతి అందాలను కనువిందు చేసుకున్నారు.

విష సర్పాలకు నిలయాలుగా ప్రభుత్వ కార్యాలయాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలో గల ప్రభుత్వ కార్యాలయాలు విష సర్పాలకు నిలయాలుగా మారాయి. స్థానిక తహశీల్దార్ కార్యాలయంతో పాటు ఐసిడిఎస్, ఎంఆర్‌సి, గృహ నిర్మాణ శాఖ కార్యాలయాలు ఒకే వరుస క్రమంలో ఉన్నాయి. వీటికి తోడుగా కార్యాలయాలకు వెనుక భాగంలో తుప్పలు, డొంకలు అధికంగా ఉన్నాయి. తహశీల్దార్, ఐసిడిఎస్ కార్యాలయాలు మూతపడడంతో విషసర్పాలకు ఆవాసాలుగా మారాయి. కొద్దిరోజుల కిందట ఎమ్మార్సీ కార్యాలయం వద్ద విషసర్పం హల్చల్ చేయడంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు.

శరవేగంగా ఆలయ పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో నిర్మిస్తున్న వీరాంజనేయ ఆలయ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మాజీ ఎంపిటిసి సభ్యులు దాసరి నాగరత్నం తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం చేపట్టిన శ్లాబ్ పనులను పరిశీలించారు. గ్రామస్తుల సహకారంతోనే ఈ దేవాలయ నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే అందరి సహకారాలతో ఆలయ నిర్మాణం పూర్తి దశలో చేస్తామన్నారు.

శ్లాబ్ పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అమలు కాని మెనూ

విద్యార్థులకు నీళ్ల చారే గతి
ఇదీ వీరఘట్టం బాలుర వసతిగృహ దుస్థితి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థులకు విద్యతో పాటు రుచికరమైన ఆహార అందించాల్సిన పరిస్థితి నేడు కొరవడింది. కనీసం ఉన్నత స్థాయి అధికారుల వసతిగృహం పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థులకు న్యాయమైన వసతి, మెనూ ప్రకారం సక్రమంగా అందడం లేదు. వీరఘట్టంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమం శాఖ బాలుర వసతి గృహంలో ఆరు నుంచి పదో తరగతి వరకు 16మంది విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. విద్యార్థులంతా ఓ ప్రైవేటు ఆర్‌సిఎం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. వీరు చదివే పాఠశాలలో మధ్యాహ్న భోజన సదుపాయం లేకపోవడంతో మధ్యాహ్న సమయంలో భోజనానికి వసతి గృహానికి వచ్చి భోజనం అనంతరం మళ్లీ పాఠశాలకు వెళ్తున్నారు. ఇక్కడ వసతి గృహ అధికారి ఎఫ్ఎసి బాధ్యతలు నిర్వహించడంతో వసతి గృహ అధికారి ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారు తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వసతి గృహంలో మెనూ చార్ట్ ప్రకారం విద్యార్థులకు బోజన సదుపాయం

ఒకే కూరతో విద్యార్థులకు పెట్టిన మెనూ

అంతగా కనిపించట్లేదు. ఏదో జరిగితే తప్ప అధికారులు వసతి గృహాలు పర్యవేక్షిస్తున్నారు తప్ప కనీసం ఏ విధమైన చర్యలూ లేకపోవడంతో విద్యార్థులకు రుచికరమైన భోజనం ఎండమావుగా మారింది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షణ చేసి విద్యార్థులకు ప్రకారం భోజన సదుపాయం కల్పించాలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 'ప్రజాశక్తి' వసతి గృహం పరిశీలించగా మధ్యాహ్న భోజనంలో బంగ్లాదుంప, మిల్‌మేకర్, మంచినీళ్ల లాంటి చారుతో విద్యార్థులు పబ్బం గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ హాస్టల్‌లో తమకు మెనూ ప్రకారం భోజనం, వసతి కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇకెవైసి పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు వేసిన అన్ని పంటలను ఇ- పంటలో నమోదు చేసి త్వరగా ఇకెవైసి పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కేసలి, కొటికిపెంట, బొబ్బిలివలసలో ఇ-పంట, ఇకెవైసి నమోదును ఈ సందర్భంగా త్వరితగతిని నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. అలాగే రైతులు కూడా తమ పంటల నమోదుకు ముందుకు రావాలని కోరారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్‌లో భాగంగా మండలంలోని మడవలసలో భూతాల లక్ష్మి, ఆకుల అప్పారావుకు రూ.15వేలు రాయితీపై గతేడాది అందించిన పిండి మిల్లుల పనితీరును పరిశీలించారు. పిండి మిల్లులు బాగున్నాయని, ఎక్కువ శబ్ధం, కుదుపుల్లేకుండా బాగా పనిచేస్తున్నాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రూ.15వేలు రాయితీపై పిండి

ఇకెవైసి నమోదును పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

మరలు ఉన్నాయని, కావాల్సిన రైతులు రూ.21వేలు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. మరలు కావాల్సిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను గానీ, పాచిపెంట మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మణ్, మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావెంకట్రావు, జయకృష్ణ

విశ్వతేజ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పాలకొండ

కీర్తిశేషులు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు నట, రాజకీయ విశేషాలను తెలుపుతూ విశ్రాంత గ్రంథాలయ అధికారి కనపాక చౌదరినాయుడు రచించిన విశ్వతేజ పుస్తకాన్ని ఆదివారం కొండాపురం దగ్గర ఒక ఫంక్షన్ హాల్‌లో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ దేశంలోనే గొప్ప వ్యక్తి అని, అలాంటి వ్యక్తి చరిత్రను పుస్తకరూపంలోకి తీసుకురావడం గర్వించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, మార్కుఫెడ్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ, ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి, పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదికవి నన్నయ్య జీవిత చరిత్రను విద్యార్థులకు చదివి వినిపించారు. పద్యాలు, గద్యాలు, చదరంగం, కేరంబోర్డు, కబడ్డీ పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పలురకాల పుస్తకాలను సిద్ధం చేశామని, వీటిని చదువుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గ్రంథాలయ నిర్వాహకులు మధుసూదనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ క్రికెట్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణలో పిసిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నగరపంచాయితీ చైర్మన్ పల్లా ప్రతాప్, ఉద్యోగుల సంఘం నేత భరత్ భూషణ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహద పడతాయని అన్నారు. మొదటి రోజు ప్రారంభ పోటీలో పాలకొండ, వీరఘట్టం జట్లు తలపడగా వీరఘట్టంపై పాలకొండ జట్టు గెలుపొందింది. నగరపంచాయితీ సమన్వయకర్త పల్లా కొండలరావు ఈ టోర్నమెంట్ నిర్వహణకు రూ.20వేలు ఆర్థిక సహకారం అందించారు. ఇలాంటి కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముఖేష్, సందీప్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు
జెఎన్‌టియుజివి జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ వాలీబాల్ పోటీలకు జెఎన్‌టియు - జివి మహిళా జట్టు ఎంపికైంది. జెఎన్‌టియులో శనివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. పి.శ్రావణి, జి.హర్షిత, వి.ధాత్రి, బి.సాయిసుచిత్ర (జిఎంఆర్ఐటి), జి.గుణశ్రీ, బి.కావ్య (విజ్ఞాన్ ఉమెన్స్ కాలేజ్), పి.గాయత్రి (అవంతి ఇంజినీరింగ్ కళాశాల, భోగాపురం), పి.శృతి (ఇమ్మానుయేల్ ఇంజనీరింగ్ కాలేజ్), బి.మోహనలత, ఎం.సువర్ణ (జెఎన్‌టియు-జివి) కె.కీర్తి, (అవంతి కళాశాల గరివిడి), ఎ.తన్సీరాణి (డైట్ కాలేజ్) ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జైపూర్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారు. వీరికి యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు.. క్రీడా యూనిఫాం, టిఎ, డిఎలను అందించి, యూనివర్సిటీకి, కళాశాలలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

పిల్లర్లకే పరిమితమా..?

ప్రజాశక్తి - వీరఘట్టం

చెత్త నుంచి సంపద తయారు చేసే వాటి ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్న ఆశయంతో గత టిడిపి ప్రభుత్వ హయాంలో చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. అధికారుల అలసత్వం, గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల చెత్త సంపద కేంద్రాలు పిల్లర్లకే పరిమితమయ్యాయి. మండలంలోని పివిఆర్ పురం, ఎం.రాజపురం తదితర గ్రామాల్లో సంపద కేంద్రాలు లేకపోవడంతో గ్రామాల్లో సేకరించిన చెత్తంతా ఒక చోటుకు తరలించి చేతికి వచ్చిన ఆదాయాన్ని కాల్చి వేస్తున్నారు. చెత్తను కాల్చి వేయడం వల్ల కాలుష్య వెదజల్లడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీటిపై అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేసి

పిల్లర్లకే పరిమితమైన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు చెత్త నుండి సంపద తయారు చేసే స్థితికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవడంలో విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నకిలీ పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కోడి పందేలు ఆడితే చర్యలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతర్ల సందర్భంగా కోడి పందేలు, పేకాట, పొట్టేలు పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.దేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు పెడతామని హెచ్చరించారు.

పండగ వేళల్లో చాలామంది సొంతూళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. వీటిని అరికట్టేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్) యాప్‌ను పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా ఇళ్లకు రక్షణ కల్పించుకోవచ్చు. ప్రస్తుతం సంక్రాంతి నేపథ్యంలో విజయనగరం నగరంతోపాటు బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయతీ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

- ప్రజాశక్తి, విజయనగరంకోట

ఇంటికి ఈ తాళం

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో దొంగతనాలకు చెక్ ● పట్టణ ప్రజలకు రక్షణ కవచంలా మొబైల్ యాప్

పనిచేసేది ఎలా అంటే..

ఈ సౌకర్యాన్ని పొందాలంటే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో పేరు, చిరునామా, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. పోలీసులు ఓ ఐడి కేటాయిస్తారు. సంబంధిత వివరాలతో ఇతర ప్రాంతానికి వెళ్తున్నట్లు పోలీసులకు పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వాలి. ఏయే రోజుల్లో రక్షణ కావాలో తెలియజేయాలి. తద్వారా వారు స్పందించి వైర్‌లెస్ కెమెరా (సిసి కెమెరా) వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఓ



యుపిఎస్‌తోపాటు డేటా కార్డును దానికి అనుసంధానిస్తారు. ఈ క్రమంలో ఇంట్లోకి ఎవరైనా వస్తే ఆ కదలికల ఆధారంగా వెంటనే ఇంటి యజమానితోపాటు స్టేషన్‌కు సమాచారం వెళ్తుంది. దీంతో ఆ ఇంటికి భద్రత లభిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉచితంగా పొందవచ్చు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంట్లో వెలుతురు ఉండేటట్లు ఏదో ఒక చోట బల్బు వేసి ఉంచాలి. యుపిఎస్ విద్యుత్తు లేకుండా కొన్ని గంటల వరకు మాత్రమే పనిచేస్తుంది. ఎక్కువ రోజులు ఇళ్లకు తాళం వేసి వెళ్లేవారు ఈ విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో హెచ్చరిక వస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

పట్టణ ప్రజలు వినియోగించుకోవాలి

జిల్లాలోని విజయనగరం 1వ పట్టణ, 2వ పట్టణ, రూరల్, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్సిపల్ ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలు సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్తే, తమ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పట్టణ ప్రజల ఆస్తులకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ రక్షణ కవచంలా నిలుస్తుంది. దీనిపై ప్రజల్లో అవగాహన పెరగాలి.

- వకుల్ జిందాల్, ఎస్‌పి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కన్నంపేటకు చెందిన మత్స తిరుపతిరావు (75) రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోనీ బిసి కాలనీలో ఒక శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా బొబ్బిలి నుంచి మక్కువ వైపు వస్తున్న లారీ కాలనీ మలుపు వద్ద వెనుక భాగం తగిలి రాసుకుపోవడంతో వృద్ధుడు తిరుపతి మరణించినట్లు గ్రామస్తులు అంటున్నారు. మరణించిన వృద్ధుడు తిరుపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సిహెచ్‌సికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన తిరుపతిరావు

వేర్వేరు ప్రమాదాల్లో
ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

లారీ ఢీకొనడంతో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్ర ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం రావుపల్లికి చెందిన గడిదేశి రాంబాబు డిగ్రీ చదివాడు. ఉద్యోగ ప్రయత్నం కోసం స్కూటీ మీద విశాఖపట్నం వెళ్లి తిరిగి రాత్రి ఒంటిగంటకు బయలుదేరి వస్తుండగా సీతానగరం బ్రిడ్జి దగ్గరలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ రిఫర్ చేశారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

పాచిపెంట : మండలంలోని పనుకువలస సమీపాన గల చైతన్య పాలిటెక్నికల్ కాలేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాచిపెంటకు చెందిన బొత్స దిలీప్ (23) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాచిపెంటకు చెందిన బొత్స దిలీప్ ఆదివారం సాలూరు నుంచి ద్విచక్ర వాహనంపై పాచిపెంట వస్తుండగా పనుకువలస గ్రామ సమీపంలో గల చైతన్య పాలిటెక్నికల్ కాలేజీ వద్ద సెల్ఫ్ ఆక్సిడెంట్ గురయ్యాడు. ఈ ప్రమాదంలో రెండు కాళ్లు, చెయ్యి విరిగిపోయాయి. ప్రమాదానికి గురైన దిలీప్‌ను స్థానికుల సహాయంతో హుటాహుటిన సాలూరు చికిత్స నిమిత్తం సిహెచ్‌సికి తరలించారు.అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల యాలం దగ్గర పుర్రె దాలి నాయుడుకు చెందిన వరిగడ్డి కుప్ప ఆదివారం దగ్ధమైంది. వెంటనే స్పందించిన అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొనిచ్చారు. ఏళ్ల తరబడి పశువుల దాణా కోసం ఉంచిన గడ్డి కాలిబూడిదవ్వడంతో బాధిత రైతు దాలినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సకాలంలో ఫైర్ ఇంజన్ రాకపోతే మరికొన్ని వరిగడ్డి కుప్పలు అగ్నికి ఆహుతయ్యేవని పక్కనే ఉన్న వరి గడ్డి యజమానులు తెలిపారు.